క్లుప్తంగా

ఆర్టీసీ డీఎంగా మంజుల



గద్వాల క్రైం: ఆర్టీసీ గద్వాల డిపో మేనేజర్‌గా గురువారం మంజుల బాధ్యతలు స్వీకరించారు. ఉప్పల్ డిపోలో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేసిన ఆమె.. పదోన్నతిపై గద్వాలకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిపో అభివృద్ధి, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రయాణికులకు అవసరం మేరకు బస్సు సర్వీసులను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

మిరప సాగుపై అవగాహన ఉండాలి



మల్దకల్: మిరప సాగుపై రైతులకు పూర్తిస్థాయి అవగాహన ఉండాలని సంహిత క్రాప్ కేర్ సీఈఓ, శాస్త్రవేత్త శ్యాంసుందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని విఠలాపురం రైతువేదికలో గురువారం మిరప రైతులతో నిర్వహించిన సమావేశానికి హాజరై మాట్లాడారు. రైతులు నాణ్యమైన విత్తనాలను వినియోగించాలని సూచించారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వినియోగించడం వల్ల అధిక దిగుబడులను సాధించవచ్చన్నారు. అనంతరం మిరప పంటకు సోకే తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచు పురుషోత్తంరెడ్డి, ఏఓ రాజశేఖర్, ఏఈఓ భాస్కర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



ధరూరు: హరితహారం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఎంపీడీఓ జబ్బార్ కోరారు. మండలంలోని పెద్దపాడులో గురువారం ఉపాధి హామీ కూలీలతో మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ప్రభుత్వ స్థలాలు, ఇంటి ఆవరణ, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఐకి సన్మానం



ఎర్రవల్లిచౌరస్తా: అలంపూర్ నూతన సీఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన రాజును గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకుడు జోగుల రవి, వెంకటేష్, వెంకటన్న, రాజు, రాముడు, రవి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

అయిజ: మున్సిపాలిటీలోని 11వ వార్డు కౌన్సిలర్ విజయలక్ష్మి మామ వెంకట్రాముడు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ చిన్నదేవన్న, కమిషనర్ నర్సయ్య, మేనేజర్ రాజేష్, బీఆర్‌ఎస్ నాయకుడు చందు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా వెంకట్రాముడు పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మైనార్టీల అభ్యున్నతికి కృషి

గద్వాల రూరల్: ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. గద్వాల నియోజకవర్గంలో నూతనంగా 14 ఉర్దూ ఘర్ కమ్ షాదీఖానాలు మంజూరైనట్లు తెలిపారు. ఇందుకుగానూ రూ.4.20కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



పుష్కరఘాట్ వద్ద వరదలకు కొట్టుకుపోయిన రక్షణ కంచె

- పుష్కరఘాట్ల వద్ద ధ్వంసమైన రక్షణ కంచెలు
- పునర్నిర్మాణంపై దృష్టి సారించని అధికారులు
- భయాందోళనలో భక్తులు



కృష్ణమ్మ విగ్రహం వద్ద ధ్వంసమైన కంచె

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి క్షేత్రంలోని కృష్ణానది పుష్కర ఘాట్లు ప్రమాదభరితంగా మారాయి. ఘాట్ల వద్ద ధ్వంసమైన రక్షణ కంచెలను పునర్నిర్మించకపోవడంతో ఎప్పుడేం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. వరదల కారణంగా రక్షణ కంచెలు పూర్తిగా ధ్వంసమై కొట్టుకుపోయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదు. పుష్కర ఘాట్ల వద్ద రక్షణ కంచెలు లేకపోవడంతో భక్తులు అవస్థలు పడుతున్నారు. వానాకాలంలో కృష్ణానదికి వరద ఉధృతి పెరగనున్న నేపథ్యంలో భయాందోళనకు గురవుతున్నారు. పుష్కరఘాట్ల వద్ద ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడంలేదని వాపోతున్నారు.

నిత్యం వందల సంఖ్యలో..

బీచుపల్లి క్షేత్రంలో అభయాంజనేయస్వామి, కోదండరామస్వామి, జ్ఞాన సరస్వతి ఆలయంతోపాటు శివాలయం వంటి ప్రముఖ ఆలయాలు ఉండటంతో నిత్యం వందల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. మొదట కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి ఆలయాల్లో పూజలు చేస్తారు. ప్రతి ఏటా నెలరోజులపాటు అంగరంగ వైభవంగా జరిగే బీచుపల్లి జాతర సందర్భంగా, వినాయక నిమజ్జనం సమయంలో వేలాది మంది భక్తులు వస్తుంటారు. పుష్కర ఘాట్లు, కృష్ణమ్మ విగ్రహం వద్ద భక్తుల రక్షణ కోసం ఏర్పాటు చేసిన ఇనుప కంచెలు సక్రమంగా లేకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

పట్టించుకోని అధికారులు

పుష్కరఘాట్లలో ఇనుప కంచెలు లేకపోవడం వల్ల ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయినా అధికారులు పట్టించుకోవడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరదల తర్వాత కంచెలను పునర్నిర్మించకపోవడంతో భక్తులకు రక్షణ కరువైందని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పుష్కరఘాట్ల వద్ద ఇనుప కంచెలను ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

ప్రమాదాల బారిన పడుతున్నారు



పుష్కరఘాట్ వద్ద ఇనుప కంచెలు సక్రమంగా లేకపోవడంతో యువత అధికంగా ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా వినాయక నిమజ్జనం రోజు రాత్రివేళల్లో భక్తులు అధికంగా రావడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఘాట్ల వద్ద కొంతమంది యువకులు సెల్ఫీలు దిగుతూ ప్రమాదానికి గురై ప్రాణాలను పోగొట్టుకున్నారు. – నరేష్, భక్తుడు

కంచెలు ఏర్పాటు చేయాలి...



పుష్కరఘాట్ల వద్ద భక్తుల రక్షణ కోసం ఏర్పాటు చేసిన కంచెలు పూర్తిగా కొట్టుకుపోవడం ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా సెలవు దినాల్లో సమీప ప్రాంతాల నుంచి పర్యాటకులు కుటుంబ సభ్యులతో కలిసి అధికంగా వస్తుంటారు. భక్తుల రక్షణ కోసం తక్షణమే ఇనుప కంచెలను ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి. – అశోక్‌కుమార్‌రెడ్డి, భక్తుడు

అధికారులకు విన్నవించాం..



పుష్కరఘాట్లలో ఇనుప కంచెలు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని పలుమార్లు అధికారులకు విన్నవించాం. ఇప్పటివరకు అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ప్రమాదాలు మాత్రం తరచూగా జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి. – నర్సమ్మ, సర్పంచ్, బీచుపల్లి

ఉన్నతాధికారులకు సర్వే రిపోర్ట్



రూట్ సర్వే చేస్తున్న ఆర్టీసీ అధికారులు (ఫైల్)

అయిజ: ఆర్టీసీ అధికారులు ఇటీవల నిర్వహించిన అయిజ–ఎమ్మిగనూరు రూట్ సర్వేకు సంబంధించిన రిపోర్ట్‌ను గురువారం గద్వాల డీఎం హెచ్.శ్రీనివాస్ ఉన్నతాధికారులకు అందజేశారు. మండల కేంద్రం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు వరకు మొత్తం 42 కి.మీ. బస్సు సర్వీస్ నడపాల్సి ఉంది. రెండు రాష్ట్రాల మధ్యనున్న పులికల్ వద్ద తుంగభద్ర నదిపై నిర్మించిన బ్రిడ్జి నిర్మాణం తుది దశకు చేరింది. బ్రిడ్జిని అధికారికంగా ప్రారంభించిన అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆర్టీసీ అధికారులు, రాష్ట్ర అధికారులు అగ్రిమెంట్ చేసుకొని బస్సు సర్వీస్‌లను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అయిజ నుంచి ఎమ్మిగనూరు వరకు మొత్తం 8 గ్రామాల వద్ద స్టేజీలను ఏర్పాటు చేసే అవకాశం ఉంది. అయితే పులికల్ నుంచి అయిజ వరకు రోడ్డు శిథిలమైంది. రోడ్డు నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో బస్సు ప్రయాణానికి ప్రతికూలంగా ఉంది. అన్ని అడ్డంకులు తొలగిపోతే రెండు రాష్ట్రాల మధ్య బస్సు సౌకర్యం ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన



గట్టులో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు



అలంపూర్‌లో..

అలంపూర్: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నర్సింహ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పంచాయతీ కార్మికుల సమ్మె శిబిరంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల పరిశుభ్రతకు విశేష సేవలందిస్తున్న కార్మికులను రెగ్యులరైజ్ చేయడంతోపాటు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లాలన్న, మద్దిలేటి, శివానంద్, దాసు, అఖిల్, ఎల్లన్న, రమేష్, సురేష్ పాల్గొన్నారు.

మల్దకల్: ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికుల సమ్మె కొనసాగింది. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో తిమ్మన్న, కిష్టన్న, రాముడు, వెంకటన్న, సత్యన్న, రాములు తదితరులు పాల్గొన్నారు.

గట్టు: వర్షంలోనూ పంచాయతీ కార్మికులు తమ ఆందోళనను కొనసాగించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

కార్మిక గర్జనను జయప్రదం చేయండి

శాంతినగర్: కార్మిక సమస్యల సాధన కోసం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఆగస్టు 4న హైదరాబాద్‌లో కార్మిక గర్జన చేపట్టినట్లు ఆ సంఘం వడ్డేపల్లి మండల అధ్యక్షుడు మధు తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో చేపట్టిన నిరవధిక సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపారు. అనంతరం కార్మిక గర్జన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కల్యాణరాముడు, శాంతిరాజు, మద్దిలేటి, రవి, సోమన్న, ప్రకాశం, ఆంజనేయులు, కృష్ణ, పద్మమ్మ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన బీఆర్‌ఎస్‌వీ కోఆర్డినేటర్



శాంతినగర్: బీఆర్‌ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య, ఆయన సతీమణి ప్రేమలత గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. రాజకీయంగా ప్రోత్సాహం అందించాలని చల్లాను కోరినట్లు తెలిపారు.

అధికార ప్రతినిధుల సమావేశానికి హాజరు



అయిజ: గాంధీ భవన్‌లో గురువారం ఏఐసీసీ ఇంచార్జ్ మాణిక్ ఠాక్రే ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి అయిజకు చెందిన టీపీసీసీ అధికార ప్రతినిధి షేక్షావలి ఆచారి హాజరయ్యారు. జిల్లాకు ఒకరి చొప్పున 33మంది అధికార ప్రతినిధులను ఇంచార్జ్‌లుగా నియమించినట్లు ఆయన తెలిపారు. జిల్లా ఇంచార్జ్‌లు పార్టీ బలోపేతానికి కృషి చేయనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ ఆదేశాలు పట్టవా?

శాంతినగర్: భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రభుత్వం పాఠశాలలకు రెండురోజుల పాటు సెలవులు ప్రకటించగా.. శాంతినగర్, వెంకటాపురంలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం తరగతులను నిర్వహించడం ఎంతవరకు సమంజసమని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు కొంకల భీమన్న ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ వడ్డేపల్లి మున్సిపాలిటీ, అయిజ మండలం వెంకటాపురంలోని ప్రైవేటు పాఠశాలలను గురువారం నడిపించారని, విద్యార్థులకు ఏమైనా ప్రమాదం సంభవిస్తే బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేసిన పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బీజేపీ నాయకుల అరెస్ట్



కేటీదొడ్డి పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ నాయకులు



అయిజ పోలీస్‌స్టేషన్‌లో....

అయిజ: భారతీయ జనతాపార్టీ రాష్ట్రశాఖ డబుల్ బెడ్రూం ఇళ్లపై పోరు చేపట్టిన సందర్భంగా గురువారం పోలీసులు స్థానిక బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అరెస్టయిన వారిలో అసెంబ్లీ కన్వీనర్ తిరుమలరెడ్డి, నాగరాజు, వెంకటేష్, శేఖర్, అంజి, పరశురాముడు, శేఖర్ ఉన్నారు.

కేటీదొడ్డి: ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అబద్ధాలతో కాలయాపన చేస్తోందని బీజేపీ నాయకులు మండిపడ్డారు. డబుల్‌బెడ్రూం ఇళ్ల పరిశీలనకు బయల్దేరిన బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో శ్రీనివాసులు, అశోక్, తిరుమల్, తిరుపతి, సురేష్, నర్సింహులు ఉన్నారు.

గట్టు: స్థానిక బీజేపీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు బల్గెర శివారెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ రాముడులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించి సొంత పూచీకత్తుపై సాయంత్రం విడుదల చేశారు.

ఉండవెల్లి: బీజేపీ నాయకులు చేపట్టిన డబుల్ బెడ్రూం ఇండ్ల పరిశీలన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. స్థానిక బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

మానవపాడు: మండలంలోని బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, ఈశ్వర్, బాషా,, రవి ఉన్నారు.

ధరూరు: బీజేపీ మండల నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టయిన వారిలో హన్మంతరాయ తదితరులు ఉన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల, కోదండాపురం పీఎస్‌ల పరిధిలో పలువురు బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. హైదరాబాద్‌లోని బాటసింగారంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి చేపట్టిన డబుల్‌బెడ్రూం ఇళ్ల పరిశీలన కార్యక్రమానికి వెళ్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐలు అశోక్‌బాబు, కృష్ణదేవ తెలిపారు. అరెస్టయిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు జగదీశ్, కిసాన్‌మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యారెడ్డి, కిశోర్‌కుమార్ తదితరులు ఉన్నారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి



మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్డీఓ సరోజ

రాజోళి: మహిళా సంఘాలు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని అడిషనల్ డీఆర్డీఓ సరోజ అన్నారు. మండల కేంద్రంలో గురువారం వీఓఏలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. స్వయం సహాయక సంఘాలు తీసుకున్న రుణాలను చెల్లించడంలో వీఓఏలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. సంఘాలు రెగ్యులర్‌గా చెల్లింపులు చేస్తున్నారా, బకాయిలు పడుతున్నారా అని గమనించాలని, త్వరగా రుణాలు చెల్లించేవిధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. మాన్‌దొడ్డి క్లస్టర్‌లో పేరుకుపోయిన బకాయిలను త్వరగా చెల్లించేలా చర్యలు చేపట్టాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డీపీఎం రామ్మూర్తి, ఏపీఎం కోటేశ్వరి, శేఖర్, సీసీలు ఉన్నారు.

శిథిలావస్థకు చేరిన ఇళ్లలో నివసించొద్దు

అమరచింత: కొన్ని రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాల కారణంగా శిథిలావస్థకు చేరిన ఇళ్లతో పాటు మట్టి మిద్దెలు కూలిపోయే ప్రమాదం ఉందని, వాటిలో ఎవరూ నివసించొద్దని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ మహమ్మద్ ఖాజా కోరారు. కలెక్టర్ ఆదేశాలతో గురువారం మున్సిపల్ సిబ్బందితో పట్టణంలోని పది వార్డుల్లో శిథిలావస్థలో ఉన్న ఇళ్ల వివరాలపై సర్వే చేయించారు. మట్టి మిద్దెలలో నివసిస్తున్న కుటుంబాలను పరామర్శించి, ప్రత్యామ్నాయ గృహాల్లోకి వెళ్లాలని సూచించారు.

25న కార్యకర్తల సమావేశం

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండల కేంద్రంలో ఈనెల 25న కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగులరవి గురువారం ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అనుమతుల పేర.. ఇసుక దందా



రాజోళి: అనుమతుల పేరుతో అక్రమంగా ఇసుక దందా సాగుతోంది. ప్రభుత్వ పనుల పేర అనుమతులు తెచ్చుకునేది కొందరైతే.. దాన్ని అడ్డుగా పెట్టుకుని అక్రమంగా దందా చేసేది మరికొందరు. దీన్ని అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. నదీ పరివాహక గ్రామాల్లో జరుగుతున్న ఈ తతంగం మండల కేంద్రంలో కూడా నిత్యకృత్యమైంది. గురువారం ఓ వ్యక్తి మైనింగ్‌శాఖ నుంచి ఇసుక తరలింపునకు అనుమతులు తెచ్చుకోగా, ఎనిమిది ట్రాక్టర్లు నదిలోకి దిగాయి. దీంతో అనుమతులు ఉన్న వారి కంటే లేని వారే దర్జాగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని అర్థమవుతోంది. స్థానికంగా ఉండే కొందరు ట్రాక్టర్ల యజమానులు మరీ బరి తెగించి దందా చేస్తున్నారు. దర్జాగా ఇసుకను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే వారి ఆగడాలు మితిమీరిపోతాయని ప్రజలు అంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గద్వాల క్రైం: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన ఘటన గురువారం సంగాల పార్కు సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గద్వాల మండలం మేకలసోంపల్లికి చెందిన అజయ్ గద్వాల నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా, ఎదురుగా వచ్చిన గూడ్స్ వాహనాన్ని ప్రమాదవశాత్తు ఢీకొట్టాడు. ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఓటరు జాబితాలో తప్పులకు తావివ్వొద్దు



మానవపాడు: ఓటరు జాబితాలో తప్పులకు తావివ్వొద్దని డిప్యూటీ తహసీల్దార్ నందిని తెలిపారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో గురువారం బీఎల్‌ఓలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బీఎల్‌ఓలకు అప్పగించిన పనులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఇంటింటి సర్వేలో ఓటర్ల వివరాలను పక్కాగా నమోదు చేయాలన్నారు. నిబంధనల మేరకు ఓటరు జాబితా రూపొందించాలని సూచించారు. ఆర్‌ఐ రజనీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

మారుతున్న రాజకీయ సమీకరణాలు

గట్టు: మండలంలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. బీఆర్‌ఎస్‌లో మహిళా ప్రజాప్రతినిధిగా ఉన్న గట్టు సర్పంచ్ ధనలక్ష్మితోపాటు ఆమె భర్త కృష్ణమూర్తి, సోదరులు కారు దిగి హస్తం గూటికి చేరారు. తాజాగా పెంచికలపాడు ఎంపీటీసీ భారతీదేవి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఇందులో భాగంగానే పెంచికలపాడులో బుధవారం రాత్రి ఎంపీటీసీ కుమారుడు న్యాయవాది శ్రీదర్శన్‌రెడ్డి, అతడి సోదరుడు శ్రీవర్ధరెడ్డి తన అనుచరగణంతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ పార్టీలో చేరాలనే దానిపై సమాలోచనలు చేయడం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. భారతీదేవి 2013లో సర్పంచ్‌గా గెలుపొందగా, 2019లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఎంపీటీసీగా గెలుపొందారు. ప్రస్తుతం మెజార్టీ అనుచరులు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపడంతో ఆ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. మొత్తమ్మీద మండలంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి.

సెల్‌ఫోన్ చోరీ

అయిజ: పట్టణంలోని కొత్త బస్టాండ్ దగ్గరున్న ఓ బంగారం దుకాణంలో గురువారం సెల్‌ఫోన్ చోరీకి గురైంది. బాధితుడి కథనం మేరకు.. రాజోళి మండలం పెద్ద ధన్వాడకు చెందిన మంగళి మహదేవ్ బంగారం కొనుగోలు చేస్తుండగా, గుర్తు తెలియని వ్యక్తి సెల్‌ఫోన్‌ను చోరీ చేశాడు. దుకాణంలోని సీసీ పుటేజీలను పరిశీలించగా, చోరీకి పాల్పడిన వ్యక్తి కనిపించాడని, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

ఒకవైపు నాట్లు.. మరోవైపు పాట్లు



ముసురు వర్షానికి సల్కాపురం గ్రామ రోడ్డు బురదమయంగా మారింది. జోకన్‌గుట్ట నుంచి కంకర టిప్పర్ల రాకపోకలతో రోడ్డు మొత్తం గుంతలమయంగా తయారవ్వడంతో నడవలేని పరిస్థితి నెలకొంది. బురదమయంగా మారిన రోడ్డుపై గురువారం గ్రామస్తులు నాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయించాలని కోరారు. – గట్టు



తుమ్మిళ్ల నుంచి మాన్‌దొడ్డి వరకు బీటీరోడ్డు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డు మొత్తం బురదమయంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. గురువారం మాన్‌దొడ్డి నుంచి తుమ్మిళ్లకు వస్తున్న ఆటో బురదలో కూరుకుపోగా, ప్రయాణికులు నానా తంటాలు పడి ఆటోను బయటికి తీసి గమ్యస్థానానికి చేరుకున్నారు. – రాజోళి